ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 కనిష్ఠం 27.6
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
బుధవారం 14 ఆగస్టు 2024



వ్యాధుల పట్ల అశ్రద్ధ వహించొద్దు

బజార్‌హత్నూర్, ఆగస్టు 13: వ్యాధుల పట్ల అశ్రద్ధ వహించవద్దని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ భీంరావు అన్నారు. మండలం పరిధిలోని కొల్హారిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వివిధరకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు మాత్రలు అందించారు. ఆయన మాట్లాడుతూ వానాకాలంలో ఇళ్లచుట్టూ పరిశుభ్రతను పాటించాలని, మురికినీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సూర్య ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎం గంగుబాయి, ఆరాధన, ఆశాకార్యకర్త సురేఖ పాల్గొన్నారు.

- గ్రామాల్లో అధ్వానంగా వీధులు • కంపు కొడుతున్న కాలనీలు
- సీజనల్ వ్యాధులతో వణుకుతున్న జిల్లా ప్రజలు
- భరించలేని దుర్వాసన.. విషపురుగులతో ప్రమాదం
- ఇంటిపన్ను వసూళ్లు అంతంత మాత్రమే • నిధుల కోసం ఎదురుచూపులు
- 15వ ఆర్థిక సంఘం నిధులు జమచేస్తేనే ఊరట
- ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేనా..?

పారిశుధ్యం అస్తవ్యస్తం!



ఇచ్చోడలోని అశోక్ నగర్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచి ఉన్న నీరు



జామిడిలో చెత, పాకురుతో నిండిన మురుగునీటి గుంతలు

ఇచ్చోడ, ఆగస్టు 13: జిల్లాలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వర్షపు నీరు వెళ్లేందుకు దారులు లేక రోడ్లపై ఎక్కడికక్కడ ఆగి అంతా బురదమయంగా మారింది. ఈ రోడ్ల మీదుగా ట్రాక్టర్లు, వాహనాలు, పశువులు తిరగడంతో పలుచోట్ల కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. వీధుల్లో చేరుతున్న వరదకారణంగా గ్రామాల్లో పారిశుధ్యం దెబ్బతిని దోమలు, ఈగలు ఉధృతి పెరుగుతోంది. వ్యాధులు విస్తరించి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి ప్రజారోగ్యానికి ముప్పును తెస్తున్నాయి. జనావాసాల మధ్య నీరునిలిచి ముంగు కుంటల్లా ఏర్పడటం, వాటిలో దోమలు వృద్ధి చెందుతూ స్వైరవిహారం చేస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

• కేంద్రం నుంచి నిధుల్లేవ్..!

జిల్లాలో మొత్తం 468 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ పరిధిలో మొత్తం 1,231 గ్రామాలున్నాయి. వీటికి రాష్ట్ర (ఎస్ఎఫ్‌సీ), లేదా 15వ ఆర్థిక సంఘం నిధులు నాలుగు నెలలకోసారి విడుదలయ్యేవి. ఎన్నికల కోడ్ కారణంగా ఈఏడాది జనవరి నుంచి పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు విడుదల కావడంలేదు. ప్రస్తుతం పైపులైన్‌ల లీకులు, బోర్లు, రహదారుల మరమత్తులు, పంచాయతీ ట్రాక్టర్ రుణం రుణ వాయిదాలు, విద్యుత్తు బకాయిలు, వీధీ దీపాల నిర్వహణకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంతో కాస్త హడావుడి చేశారు. కానీ రోజువారీ పారిశుధ్య చర్యలు, ఇతర పనులకు తగినన్ని నిధుల్లేక పంచాయతీల కార్యదర్శులు జేబుల్లోంచి ఖర్చుపెట్టే పరిస్థితి నెలకొంది. ఇంటి పన్ను లవసూళ్లు సైతం అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. మొన్నటివరకు మల్టీపర్పస్ కార్మికులకు వేతన బాకాయిలు ఉండగా.. గతంలో మంజూరుచేశారు. దీంతో పాటే పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు త్వరగా జమచేస్తేనే ఊరట దక్కే అవకాశం ఉంది.

• గ్రామస్థులే స్వచ్ఛందంగా కదిలి

కొద్దిరోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పల్లెల్లోని రహదారులు చిత్తడిగా మారాయి. కనీసం వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి. దీంతో గ్రామస్థులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి సొంత ఖర్చులతో రోడ్లను మట్టితో చదును చేయించుకుంటున్నారు. గుంతలు పూడ్చి వేయిస్తున్నారు. తమ ఊరికి వచ్చే రహదారి బాగుకోసం గుంతలు పూడ్చుకునేందుకోసమైన పంచాయతీలో నిధులు లేకుండా పోయింది. పంచాయతీ మీద బారం వేస్తే వచ్చేది ఏమీలేదని తలాకొంత నిధులు సమకూర్చుకుని తమ గ్రామ సమస్యలు తామే పరిష్కరించుకుంటున్నారు. మారుమూల గిరిజన ఏజెన్సీ ప్రాంతవాసులు.



సల్యాదలో శ్రమదానంతో రోడ్డును చదును చేస్తున్న గ్రామస్థులు

• ఖాళీ ప్లాట్లు.. తప్పని పాట్లు

పట్టణాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. కొత్త కాలనీలు, గ్రామాలు వెలుస్తున్నాయి. అయితే పాత, కొత్త కాలనీల్లో నివాసాల మధ్య ఖాళీ స్థలాలతోనే ఇబ్బందులు వస్తున్నాయి. భవిష్యత్తులో ఉపయోగపడుతుందని పలువురు స్థలాలు కొనుగోలు చేసి వదిలేస్తున్నారు. తరువాత పట్టించుకోకపోవడం, ముళ్లపొదలు, పిచ్చిచెట్లు పెరిగి పాములు, విష పురుగులకు ఆవాసంగా మారతున్నాయి. వర్షం నీరు, మురుగునిలిచి దోమలవ్యాప్తికి కారణమవుతున్నాయి. చుట్టూ నివాస గృహాలు.. వాటి మధ్య ఖాళీ ప్రదేశాలు.. అవి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో పాములు, పందులకు నిలయాలుగా మారాయి. స్థల యాజమానులు వీటిని శుభ్రపరచకపోవడంతో వాటి చుట్టుపక్కల నివసించే వారికి సమస్యగా మారింది. ప్రధాన ప్రాంతాల్లోనే పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా అంతర్గత సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అంతే కాకుండా అందులో వర్షాకాలం కావడంతో జనం జ్వరాల బారినపడి ఆసుపత్రుల బాటపడుతున్నారు. ఇలాంటి దుర్గంతభరిత ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లటం, ఫాగింగ్ చేయడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది కానీ అలా జరక్కపోవడంతో సమస్య యధాతథంగా కొనసాగుతుంది. పంచాయతీ అధికారులకు పలుమార్లు కాలనీవాసులు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనలో అయినా గ్రామాలు, కాలనీలు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరతున్నారు.

త్వరలోనే పెండింగ్ నిధుల జమ

• శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

పంచాయతీలకు నిధుల కొరత ఉన్నా.. పారిశుధ్య పనులకు ఇబ్బందుల్లేవు. మార్చి నెలలో ఎస్ఎఫ్‌సీ నిధులు కొన్ని రాగా.. కార్మికులకు వేతనాలిచ్చాం. 15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు జమ కానున్నట్లు సమాచారం ఉంది. అవి రాగానే పల్లెల్లోని సమస్యల్ని ప్రాధాన్యం ప్రకారం పరిష్కరిస్తాం. ప్రత్యేకాధికారుల పాలనాలో అధికారులు గ్రామాల్లో పర్యటించేలా ప్రత్యేక చర్యలు చేపడతాం.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

బజార్‌హత్నూర్, ఆగస్టు13: మండలంలోని బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన చంద్రయ్య, కీర్తిరాజులకు వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. కీర్తిరాజుకు రూ.60వేలు, చంద్రయ్యకు రూ.18వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండలయువజన అధ్యక్షుడు చంద్రశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేరడిగొండ బంద్‌కు పిలుపు

నేరడిగొండ,ఆగస్టు13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అల్లర్లకు మద్దతుగా నేరడిగొండ బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ ఐక్య వేదిక సభ్యులు మంగళవారం తెలిపారు. మండలవ్యాప్తంగా వ్యాపార సముదాయలు, నిత్యావసర సరుకుల దుకాణాలు బంద్ చేయబడుతాయని పేర్కొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

బజార్‌హత్నూర్, ఆగస్టు13: మండలం పరిధిలోని దేగామ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు ఆ గ్రామ యువజన సంఘం తరుపున రూ.20వేల విలువ గల మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో ప్రార్థన సమయంలో ఉపయోగంగా ఉంటుందన్న ఆలోచనలతో పాఠశాలకు విద్యార్థులకు ఉపయోగ పడే మైక్‌సెట్‌ను మా వంతుగ విరాళంగా అందించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీదేగామ యువజన అధ్యక్షుడు నరేష్, వసంత్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతకే ప్రాధాన్యం ఇవ్వాలి

నార్నూర్, ఆగస్టు13: గ్రామంలో పచ్చదనం-పరిశుభ్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి దినేష్ గ్రామస్థులను కోరారు. మంగళవారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న దుర్గానగర్, జిన్‌గూడ విజయనగర కాలనీ వార్డుల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వఆసుపత్రి దగ్గరఉన్న అన్ని పిచ్చిమొక్కలు, గడ్డి, సిబ్బంది క్వాటర్ ప్రాంత ఏరియా పిచ్చిమొక్కలను గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించారు.

ఉట్నూర్ మండలం తుడందెబ్బ అధ్యక్షుడిగా త్రిమూర్తి

ఉట్నూర్, ఆగస్టు13: ఉట్నూర్ మండలతుడందెబ్బ మండల అధ్యక్షుడిగా పెందూరు త్రిమూర్తి ఎన్నికైనట్లు తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురకబాపురావు తెలిపారు.ఉపాధ్యక్షులుగా టేకం హరిప్రసాద్, గోడం అశీష్, సిడాంబాపురావు, గోదిరావు, పెందూరుతుకారాం, ప్రధాన కార్యదర్శిగా గురిజల రవీందర్, కోశాధికారిగా పెందూరు మోతిరామ్, సాంస్కృతిక కార్యదర్శిగా కుడిమెత శ్యామ్‌రావు, సోషల్‌మీడియా కన్వీనర్‌గా గేడంఈశ్వర్, తదితరులు ఎన్నికయ్యారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి



జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు13: జాతీయ సమైక్యతను పెంపొందించేలా ప్రతీఒక్కరు తమ ఇంటిపై స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగరవేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర గీత్ ఏక్ సాత్ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్‌చౌక్ వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థుతో కలిసి ఎమ్మెల్యే సామూహికంగా జాతీయ గీతం ఆలపించారు. అంతకుముందు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమం నిర్వహించగా స్థానిక నేతాజీ చౌక్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ నీళ్లతో శుద్ధిచేశారు. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ సమైక్యత పెంపొందించడానికి ప్రధాన మంత్రి నరేంద్ మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. బాధ్యతగల పౌరులు వారి ఇళ్లపై జాతీయజెండాలను ఎగరవేసి సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బ్రహ్మానంద్, ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, లాల మున్న, జోగు రవి, కృష్ణ యాదవ్ రఘుపతి, బోయర్ విజయ్, వేదవ్యాస్, రాజేష్ దోని జ్యోతి, శ్రీనివాస్, సుభాష్ పాల్గొన్నారు.

ప్రతీఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

జైనథ్: ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతీఒక్కరు తమఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని బీజేపీ జైనథ్ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్ అన్నారు. హర్‌ఘర్ తిరంగా జెండా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జైనథ్ మండలంలోని బెల్గావ్ గ్రామంలో ప్రజలు, నాయకులకు జాతీయజెండాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంట సురేస్‌రెడ్డి, ప్రశాంత్‌లతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బెల్గావ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బెల్గావ్‌లో జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు

జాతీయ జెండాల పంపిణీ

నేరడిగొండ: హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ జాతీయజెండాలను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు రాఘవులు, ప్రవీణ్, మాజీ సర్పంచ్‌లు కమల్‌సింగ్, పరశు రాం, నారాయణ, కోటేశ్, తాజా మాజీ ఎంపీటీసీలు భీంరావ్, కృష్ణరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు13: జిల్లాకేంద్రంలోని రిమ్స్‌లోని ఆర్‌బీఎస్‌కే డైస్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పిల్లల ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఉమ్మడిజిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధిత పిల్ల ల తల్లిదండ్రులు తరలివచ్చి చికిత్సలు చేయించుకున్నారు. కిమ్స్ పిల్లల గుండె వైద్యనిపుణుడు సందీప్‌వర్మ, వైద్యసిబ్బంది పరీక్షలు చేశారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

బోథ్, ఆగస్టు13: మాజీ ఎంపీటీసీ జాదవ్ నానాజీ ఇటీవల అనారోగ్యానికి గురై గుండెకు ఆపరేషన్ చేయించుకోవడంతో ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేవెంట మాజీ ఎంపీటీసీ రాయల్, నాయకులు భీమ్రావు, మాజీ సర్పంచ్ సదానంద్, శ్రీధర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, రాథోడ్, సజన్ నాయకులు దేవేందర్‌రెడ్డి, తదితరులున్నారు.



చౌక ధరలదుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

తంతోలిలో కలెక్టర్ పర్యటన

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 13: రూరల్ మండలంలోని తంతోలిలో కలెక్టర్ రాజర్షిషా మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా చౌకధరల దుకాణాన్ని పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దుకాణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంతకుముందు గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఆయనవెంట ప్రత్యేకాధికారి నాగ భూషణం, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన సరుకులు సరఫరా చేయాలి: పీవో



ఉట్నూర్‌లో సరుకుల టెండర్లు నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓ

ఉట్నూర్, ఆగస్టు13: సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకోసం కావాల్సిన నిత్యావసర సరుకులను నాణ్యతగా సరపరా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెండర్లకు ఉమ్మడి జిల్లాలోని వ్యాపార కాంట్రాక్టర్లు హాజరుకాగా, ఆహార సరుకుల కొనుగోలుకమిటీ ఛైర్మన్ ఖుష్బుగుప్తా అధ్యక్షతన పప్పులు, ఉప్పులు, మంచి నూనె, చింతపండు, మిర్చి, పసుపు తదితర 9రకాల సరుకుల కొనుగోలుతోపాటు కాస్మోటిక్స్ కొనుగోలు కోసం నిర్వహించిన టెండర్లకు కాంట్రాక్టర్లు హాజరై తమ ధరలను చూయించడంతో ప్రాజెక్టు అధికారి కమిటీ ఆధ్వర్యంలో నెగోషియేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ ఇన్‌చార్జీ డీడీ జాదవ్‌వసంత్‌నాయక్, జీసీసీ డీఎం రామనాథం, నిర్మల్ డీటీడీఓ అంబాజిజాదవ్, జీసీసీ మేనేజర్ గులాబ్‌సింగ్ ఉన్నారు.

బంద్ ప్రశాంతం

- బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జిల్లాలో పలుచోట్ల బంద్
- స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు, వ్యాపారులు



బంద్‌తో నిర్మానుష్యంగా మారి కనిపిస్తున్న ప్రధాన చౌక్‌లు

గుడిహత్నూర్‌లో మూసి ఉన్న దుకాణాలు

గుడిహత్నూర్, ఆగస్టు13: బంగ్లాదేశ్‌లో హిందువులపైనా, హిందూ దేవాలయాలపైనా జరిగిన దా డులను నిరసిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం గుడిహత్నూర్‌లో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈసందర్భంగా వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేసి బంద్‌కు సంపూర్ణ సహకారం అందించారు. నాయకులు విద్య సంస్థలను మూసి వేయి ంచారు. ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ వివిధ హిందూ సంఘాల నాయకులు, ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపివారికి రక్షణ కల్పించాలని కోరారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగ కుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

బోథ్‌లో స్వచ్ఛందంగా బంద్

బోథ్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మండలంలో మంగళవారం వ్యాపారవర్గాల వారితోపాటు ప్రజలు స్వచ్ఛందంగా బందును పాటించారు. ఇందులో పై దాడులను అరికట్టేందుకుగాను ఐక్యరాజ్యసమితి జోక్యం చేసు కోవాలని డిమాండ్‌చేశారు.

ర్యాలీ సందర్భంగా సోనాల మండల కేంద్రంలో దుకాణాలన్నీ ఉదయం నుండి సాయంత్రం వరకు మూసిఉంచారు. అయితే మండలకేంద్రంలో వారు బందుకు సహకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దుకాణాలు మూసిఉంచి బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. అంతేగాక మండల కేంద్రంలో పలు పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మద్దతుపలికారు. మ రోవైపు మండలకేంద్రంలోని అన్నివర్గాలు బంద్‌కు సహకరించి సాయంత్రం సంతకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడకుండా షాపులను తెరిచారు.

ఆదిలాబాద్ రూరల్: ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలు మంగళవారం స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారసంస్థలపై, హిందువులపై దాడు లను ఖండిస్తూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ బంద్‌కు పి లుపునిచ్చింది. ఈనేపథ్యంలో ఉదయం నుంచి అన్నిదుకాణసముదాయాలు బంద్ చేపట్టి సంఘీభావం ప్రకటించారు.


వర్క్ షాప్‌లో పాల్గొన్న సిబ్బంది

పట్టణంలో స్మార్ట్ వర్క్ షాప్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 13: ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీ మహా లక్ష్మిహోండా షోరూం తమ సర్వీస్ సెంటర్‌ను స్మార్ట్ వర్క్ షాప్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇటువంటి వర్క్ షాప్ మాహోండా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం తమకు చాలా సంతోషంగా ఉందని సంస్థ డైరెక్టర్ నల్ల నకుల్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కొంకటి శ్రావణ్ కుమార్, సర్వీస్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవిత బీమా నిత్యావసరం : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, ఆగస్టు, 13: ప్రజలకు కూడు.. గుడ్డ.. నీడతో పాటు జీవిత బీమా అత్యవసరంగా మారిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక సీఎస్‌సీ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జీవితబీమా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్‌ను అందరూ చేసుకోవాలని ప్రస్తుతకాలంలో ఇన్సూరెన్స్ అత్యవసరంగా మారిందని గత ప్రభుత్వం రైతులకు ఉచిత బీమా కల్పించిందని కానీ.. భూములు లేనివారికి బీమా చేసుకోవాల్సిన అవసరంఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు వారి చిన్న మొత్తలా ఇన్సూరెన్స్ అందరు తీసుకొని కుటుంబ భవిష్యత్తు పదిలం చేసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలకన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, సంతోష్,శ్యాంరెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా సాగాలి: ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్,ఆగస్టు13:అధికజనాభా ఉన్న బీసీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం దిశగా సాగాలని ఎమ్మెల్యే పాయలశంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ యోజనపథకంపై అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించారు.బ్యాంక్ అధికారులు దరఖాస్తు చేసుకునే విధానంతో పాటు బ్యాంక్ సేవల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీసీసంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చిక్కాలదత్తు, కలాల శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి ఆదినాథ్, పీఎంవిశ్వకర్మ సీఎస్‌సీ స్టేట్‌హెడ్ రాజేందర్ ఉన్నారు.

ఐటీడీఏ పీవో హామీతో

తెరుచుకున్న జీసీసీ పెట్రోల్‌బంకులు

ఉట్నూర్, ఆగస్టు 13 : ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా హామీ మేరకు జీసీసీ పెట్రోల్‌బంకులు తెరుచుకున్నాయని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ రామనాథం తెలిపారు. గత ఐదు రోజులుగా వేతనాలు పెంచాలంటూ జీసీసీ ఆధ్వర్యంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, ఇచ్చోడ, సిరికొండ, కెరమెరి, తిర్యాని, కాగజ్‌నగర్, నిర్మల్‌లలో కొనసాగుతున్న జీసీసీ పెట్రోల్‌బంకుల్లో పనిచేస్తున్న 71 మంది గిరిజన దినసరి ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. గత ఐదు రోజులుగా సమ్మెలో దిగిన ఉద్యోగులు వేతనాలు పెంచాలంటూ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు తెలిపి పరిష్కరిస్తామని ప్రాజెక్టు అధికారి హామీ ఇవ్వడంతో వారు విధుల్లో చేరారు.

అగ్ని ప్రమాద నివారణ పరికరాలపై

అవగాహన పెంపొందించుకోవాలి



భైంసా, ఆగస్టు 13 : అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు గాను వాటిని నివారించే పరికరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని భైంసా ఫైర్ ఆఫీసర్ జి.రాజారామ్ సూచించారు. మంగళవారం పట్టణ పరిధిలోని పలు వ్యాపార సంస్థల్లో అగ్ని ప్రమాద నివారణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. ఆయా సంస్థల్లోని అగ్ని ప్రమాద నివారణ కోసం ఏర్పాటు చేసిన పరికరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల్లోని నిర్వాహకులకు, సిబ్బంది పరికరాల పనితీరుపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఆందోళన చెందకుండా సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తూ పరికరాల ద్వారా మంటలను ఆర్పే విధానాలను వివరించారు. ప్రతి వ్యాపార సంస్థలో ఫైర్ సేఫ్టీ వ్యవస్థను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఎక్కిన మంచినీళ్ల పంచాయతీ

- భాధనకుర్తి గ్రామంలో తాగునీటి సరఫరాను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని ఆరోపిస్తూ గ్రామస్థుల ధర్నా
- మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్ నాయకులు
- ఖానాపూర్ - మెట్‌పల్లి రహదారిపై అరగంటకు పైగా స్తంభించిన రాకపోకలు
- ఇరువర్గాల మధ్య తోపులాట.. పరిస్థితి ఉద్రిక్తత
- పోలీసుల రాకతో సద్దుమణిగిన వివాదం



ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

ఖానాపూర్, ఆగస్టు 13 : మంచినీటి పంపు వద్ద మొదలైన పంచాయతీ చిలికి చిలికి గాలివానలా మారింది. మంచినీటి పంపు వద్ద కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం సాయంత్రం 6:30 నుంచి 7:30 వరకు చింతలపేట్ గ్రామస్థులు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... ఖానాపూర్ మండలం బాదనకుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలపేట్ గ్రామంలో గత కొద్ది రోజులుగా ఊరిలో ప్రజలకు తాగునీటిని అందించే పంపు చెడిపోయింది. దీంతో ఈ పంపును రిపేరు చేయించాలని పంచాయతీ కార్యదర్శిని అడగగా గ్రామ పంచాయతీలో నిధులు లేవని మీరే స్వచ్ఛందంగా బోరు మోటార్ కొనుక్కోవాలని చెప్పినట్లు గ్రామస్థులు తెలిపారు. బోరుమోటార్ మరమ్మతులు చేయించేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో ప్రజలే తలా కొంత జమ చేసి మంచినీటి పంపును రిపేరు చేయించుకునేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ వద్దకు వెళ్లి విషయం తెలుపగా తాను అరువుపై (ఉద్దెర) కొత్త మోటార్ ఇప్పిస్తానని బిల్లు రాగానే సదరు దుకాణంలో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శిని కోరాడన్నారు. దీనికి ఒప్పుకున్న పంచాయతీ కార్యదర్శి మంగళవారం బోరు మోటార్‌ను తెప్పించి కనెక్షన్ ఇప్పిస్తుండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో విషయం తెలిసిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ బోరు మోటార్ అమర్చే ప్రాంతానికి వెళ్లి ప్రజలకు ఇబ్బంది ఉన్నప్పుడు అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారని తెలిపారు. ప్రజల ఒత్తిడితో బోరుకు కనెక్షన్ ఇచ్చి మోటార్‌ను స్టార్ట్ చేయడంతో 20 నిమిషాల పాటు నీటి సరఫరా జరిగిందన్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికి నీటి సరఫరా నిలిపి వేయడంతో గ్రామంలోని యువకులు మహిళలంతా రోడ్డెక్కి ఖానాపూర్ - మెట్‌పల్లి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకో నిర్వహిస్తున్న సమయంలోనే అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఆందోళన చేస్తున్న ప్రజల మధ్య వాగ్వాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ వాగ్వాదంలో ఓ నాయకుడు అక్కడున్న ఓ యువకుడిపై చేయి చేసుకోవడంతో గ్రామానికి చెందిన ఓ మహిళ అడ్డుగా వెళ్లడంతో నాయకుడు ఆ మహిళపై సైతం చేయి చేసుకున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి చేయి దాటుతున్న క్రమంలో ఖానాపూర్ ఎస్సై లింబాద్రి ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించారు. అయినప్పటికీ గ్రామస్థులు తిరిగి బోరు మోటార్‌ను ప్రారంభించి తమపై దాడి చేసిన వ్యక్తితో క్షమాపణ చెప్పిస్తేనే ఆందోళన విరమిస్తామని తెలిపారు. మొత్తానికి బోరు మోటార్ కనెక్షన్ పునరుద్ధరించడంతో వివాదం సద్దుమణిగింది. ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో రాజకీయం చేయడమేంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతలపేట్ గ్రామస్థులు చేస్తున్న ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు.

ఎమ్మెల్యే ద్వారా బోరు మోటార్ ఇప్పించాం.. కానీ

బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది : కాంగ్రెస్ నాయకులు

15 రోజులుగా గ్రామంలో బోరు మోటార్ చెడిపోవడంతో మంగళవారం తాము ఎమ్మెల్యే బొజ్జుకు చెప్పి గ్రామానికి మోటార్ ఇప్పించామని కాంగ్రెస్ నాయకులు గుడాల రాజన్న, లక్ష్మీరాజం, నర్సయ్యలు తెలిపారు. వారు చేయలేని పని తాము చేసినందున దానిని జీర్ణించుకోలేక గ్రామస్థులను రెచ్చగొట్టి రహదారిపై రాస్తారోకో చేయించి తమపై ఆరోపణలు చేయించారన్నారు. తమ నాయకులు ఎవరిపై దాడి చేయలేదని బీఆర్ఎస్ నాయకులు రాజకీయం కోసమే గ్రామంలో యువకుడిపై, మహిళపై దాడి చేసినట్లు ప్రచారం చేస్తూ తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు.

నిర్మల్‌లో బీజేపీ సామూహిక జాతీయ గీతాలాపన



సామూహిక జాతీయ గీతాలాపన చేస్తున్న బీజేపీ నాయకులు



భైంసాలో బీజేపీ ప్రతినిధుల ప్రదర్శనలు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 13 : బీజేపీ పిలుపు మేరకు మంగళవారం నిర్మల్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. ఎంతో మంది స్వాతంత్ర్య అమరవీరుల కృషి ఫలితంగా స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. వారిని స్మరించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, విలాస్, ఒడిసెల అర్జున్, కౌన్సిలర్లు ఎడపల్లి నరేందర్, బిట్లింగ్ నవీన్, కే.శ్రావణ్‌రెడ్డి, ఉద్యోగులు, విద్యార్థులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

భైంసా, ఆగస్టు 13 : ఎంతో మంది మహనీయుల ప్రాణ త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకుంటూ తమ తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని భైంసా పట్టణ బీజేపీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, రాష్ట్ర ప్రతినిధి బాజీరావ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలో పట్టణ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.జాతి, ఐక్యత, దేశ సమగ్రత పట్ల నిబద్ధతతో ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ నుంచి ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, పార్టీ ప్రతినిధులు రావుల పోశెట్టి, నిజాం వేణుగోపాల్, గాలి రాజు, సాయినాథ్ పాటిల్, రాకేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 13 : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాష్ట్ర బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ తన నివాసంపై మూడు రంగుల జెండా ఎగురవేశారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మూడు రంగుల జెండా ఎగుర వేసి దేశభక్తిని చాటాలన్నారు.

సోన్ మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటా మువ్వన్నెల జెండాలో భాగంగా జెండాలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు మేకల అశోక్, మార గంగారెడ్డి, నరేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజేతలకు మెడల్స్ బహూకరణ



వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆయా విభాగాలలో విజయం సాధించిన విజేతలు

ఖానాపూర్, ఆగస్టు 13 : మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్- 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజేతలకు మెడల్స్‌ను బహూకరించారు. ఈ పోటీలలో జిల్లాలోని 10 పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొనగా 69 కిలోల బాలుర విభాగంలో రిషింద్రకు గోల్డ్ మెడల్, శివసాయికి సిల్వర్ మెడల్, 61 కిలోల బాలుర విభాగంలో ఎస్‌కే కషీర్‌కు గోల్డ్ మెడల్, 55 కిలోల బాలుర విభాగంలో జే. రాజు గోల్డ్ మెడల్, ఎండీ అర్కం సిల్వర్ మెడల్, 49 కిలోల బాలుర విభాగంలో ఎ. విష్ణు గోల్డ్ మెడల్, సిహెచ్. గౌతంకు సిల్వర్ మెడల్, 49 కిలోల బాలికల విభాగంలో టి. నవ్య గోల్డ్ మెడల్, బి. శ్రీనిధి సిల్వర్ మెడల్, 55 కిలోల బాలికల విభాగంలో కే. వర్షిని గోల్డ్ మెడల్, టి. సంహిత సిల్వర్ మెడల్, 59 కిలోల బాలికల విభాగంలో బి. వైష్ణవి గోల్డ్ మెడల్, పి. అర్చన సిల్వర్ మెడిల్, 64 కిలోల బాలికల విభాగంలో నిషితవర్ధిని గోల్డ్ మెడల్ సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సాయంత్రం నిర్మల్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సోయాబ్, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్‌లు మెడల్స్‌ను బహూకరించారు. ఈ పోటీలను జాతీయ వెయిట్ లిఫ్టింగ్ రిఫరీ మహేష్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ అధికారులు రమణారావు, శ్రీనివాస్, స్థానిక ప్రధానోపాధ్యాయులు నరేందర్, తదితరులున్నారు.

మినుము పంటకు ఫంగస్ తెగుళ్లు

- ఆందోళన చెందుతున్న రైతులు

తాంసి, ఆగస్టు 13 : ఎన్నో ఏళ్ల తర్వాత ధైర్యం చేసి ఈ ఏడు ఖరీఫ్‌లో మినుము పంట వేసిన రైతాంగానికి అప్పుడే నష్టం వాటిల్లితుంది. ఎన్నో ఆశలు పెట్టుకుని ఎలాగైనా ఈసారి పంటను సాగుచేసి గణనీయమైన దిగుబడితో లాభాలు సాధించాలని ఆశపడ్డారు. ఆశించిన రీతిలోనే ఖాతా పూత వచ్చే సమయంలోనే పంటకు యెల్లో కలర్ ఫంగస్ సోకింది. దీంతో పంట అంతా పచ్చగా మారుతుంది. ఈ విషయాన్ని తెలుసుకుంటున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడు మండలంలో సుమారు 800 ఎకరాల వరకు ఈ పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంటఖాతా పూదశలో పంట ఉంది. అయితే ఈ సమయంలోనే పంటకు తెగులు వ్యాపిస్తుండటంతో నివారణ ఉపాయం తెలియక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఎన్‌టీ లావణ్య

లక్ష్మణచాంద, ఆగస్టు 13 : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కుమారి ఎన్‌టీ లావణ్య నియమితులయ్యారు. మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన లావణ్య హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

మాటల సీఎం కాదు.. చేతల ముఖ్యమంత్రి

- ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, ఆగస్టు 13 : రేవంత్‌రెడ్డి మాటల సీఎం కాదని చేతల ముఖ్యమంత్రి అని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన ఆయనకు నియోజకవర్గం తరపున సాదర స్వాగతం పలుకుతున్నట్లు తెలి పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల వ్యవధిలోనే 19కంపెనీలతో ఒప్పందం చేసుకుని దాదాపు రూ.73వేల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మాట ఇస్తే తప్పని మనిసిగా, ఒక గొప్ప పరిపాలనాధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి తనను తాను నిరూపించుకున్నారన్నారు. కేసీఆర్ హయాంలో ప్రజలకు ఒరిగిందేమ ఇలేదని దుయ్య బట్టారు. కేటీఆర్ మొక్కుబడిగా వెళ్లి ఫోటోలు దిగి రావడం తప్ప ఏనాడు విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చిన దాఖలు లేవన్నారు. కాని సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రూపురేఖలు మార్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఇందులో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లినగేష్, కాంగ్రెస్ నాయకులు గిమ్మసంతోష్, లోకప్రవీణ్‌రెడ్డి, బేల మండల అధ్యక్షులు ఫైజుల్లాఖాన్, రాందాస్‌నాక్లె, సంజయ్‌గుండావార్, వామన్‌వాంఖడే, దర్శనాల లక్ష్మణ్, రామ్‌రెడ్డి తదితరులున్నారు.



గోదావరికి ఇరువైపులా గోడలు



- భద్రాచలం తరహా కరకట్టల నిర్మాణానికి ప్రణాళికలు
- పరీవాహక గ్రామాలను వరద నుంచి కాపాడేందుకు ప్లాన్
- 40 కిలో మీటర్ల పొడవుతో నిర్మాణానికి ప్రతిపాదనలు
- రూ.70కోట్లతో అంచనాలు
- జిల్లాలోని 15 గ్రామాలకు వరద ముప్పు

నిర్మల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీఏటా వర్షకాలంలో వరద ముంపునకు గురవుతున్న గోదావరి నది పరివాహక గ్రామాలను ఆ వరద నుంచి రక్షించుకునేందుకు ఇరిగేషన్‌శాఖ అధికారులు పకడ్బంధీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏళ్ల నుంచి పరివాహక గ్రామాలను వరద ముప్పు వెంటాడుతున్న క్రమంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు ఈ దిశగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ప్రతీ వర్షకాలంలో వరదముప్పు అధికారులకు అటు పరివాహక గ్రామాల ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. ఇరిగేషన్‌శాఖ అధికారులతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్ యంత్రాంగమంతా వర్షకాలంలో వరదముప్పును వెయ్యి కళ్లతో పహారా కాయాల్సి వస్తుందంటున్నారు. ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల దిగువ నుంచి మొదలయ్యే గోదావరినది ఖానాపూర్ వరకు వర్షకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఎగువ మహారాష్ట్ర నుంచి వరద ఉధృతి పెరగడంతో ఈ ప్రాజెక్టు గేట్లు పైకెత్తి దిగువన గోదావరిలోకి నీటిని విడుదల చేస్తుంటారు. ఒకేసారి లక్షల క్యూసెక్కుల నీరు వరద రూపంలో ప్రవహిస్తున్న కారణంగా గోదావరి నది ఉప్పొంగుతుంటోంది. ఈ సమయంలో నదికి ఇరువైపులా ఉన్న పరివాహక గ్రామాలన్నీ వరద ముంపునకు గురవుతుండడం సహజంగా మారుతుంది. వర్షకాలంలో వరద వచ్చిందంటే ఈ పరివాహక గ్రామాల ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడుపుతుంటారు. అలాగే ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద నుంచి కాపాడుకునేందుకు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తుంటారు. దీని కోసం గ్రామాల్లో సైరన్లు మోగించడం, దండోరాలు వేయించడం, మైకులలో ప్రచారం చేయడం లాంటివి ఇక్కడ సర్వసాధారణం. ప్రధానంగా మత్స్యకారులు, అలాగే పశువుల కాపరులతో పాటు నదికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలంతా వర్షకాలంలో ముప్పును ఎదుర్కొంటుండడం సహజంగా మారింది. దాదాపు 15 గ్రామాలకు పైగా ప్రతీఏటా గోదావరి నది కారణంగా ముంపుకు గురవుతున్నారు. దీంతో పాటు పరోక్షంగా మరికొన్ని గ్రామాలు కూడా ఇబ్బందుల పాలవుతున్నాయి. గోదావరి నదీ పరీవాహక గ్రామాలను వరద నుంచి కాపాడుకునేందుకు అధికారులు భద్రాచలం తరహాలో కరకట్టల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. భద్రాచలంలో గోదావరి నది వరద ఉధృతి నుంచి ఆ ప్రాంతాన్ని కాపాడుకునేందుకు నిర్మించిన కరకట్టలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్న అంశాన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు జిల్లాలోని గోదావరి నదికి ఇరువైపులా కూడా కరకట్టలు నిర్మించాలని తలపెట్టారు. దీనికి అనుగుణంగానే ప్రతిపాదనలు సైతం రూపొందిస్తున్నారు.

40 కిలోమీటర్ల పొడవుతో..

సోన్ నుంచి ప్రారంభమయ్యే గోదావరినది ఖానాపూర్ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవుతో ప్రవహిస్తుంది. ఈ నలభై కిలోమీటర్ల పొడవును పరిగణలోకి తీసుకున్న అధికారులు మొత్తం నదికి ఇరువైపులా కరకట్టలను నిర్మించాలని యోచిస్తున్నారు. దీని కోసం గానూ దాదాపు రూ. 70 కోట్ల వరకు వ్యయం అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. అయితే భద్రాచలంలో నిర్మించిన కరకట్టల తరహాలోనే కాకుండా మరింత శాస్త్రీయతను జోడించి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటూ ఈ నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తున్నారు.

15 గ్రామాలకు వరద ముప్పు..

ప్రతీఏటా గోదావరినది వరద ఉధృతి కారణంగా ఈ నది పరివాహకంలోని దాదాపు 15 గ్రామాలు ప్రత్యక్షంగా ముంపునకు గురవుతుండగా మరికొన్ని గ్రామాలు పరోక్షంగా ప్రభావితమవుతున్నాయి. సోన్ నుంచి మొదలుకొని కూచన్‌పెల్లి, ధర్మారం, పార్‌పెల్లి, మునిపెల్లి, చింతల్‌చాంద, మామడ మండలంలోని కమల్‌కోట్, పొన్కల్, ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్, మేడంపెల్లి, బాదన్‌కుర్తి, ఖానాపూర్ గ్రామాలు గోదావరి నది ప్రవాహ ఉధృతికి ప్రతీఏటా ముంపు బారిన పడుతున్నాయి. ఈ గ్రామాలతో పాటు గోదావరి నదికి ఉపనది అయిన స్వర్ణానది పరివాహకంలోని పలు గ్రామాలు కూడా ముంపు బారిన పడుతున్నాయి. స్వర్ణప్రాజెక్టు నుంచి మాదాపూర్ వరకు గల గ్రామాలతో పాటు నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీ కూడా వరద ఉధృతికి ముంపునకు గురవుతోంది.



నైజాం కాలంలో గోదావరిపై నిర్మించిన సదర్‌మాట్ ఆనకట్టపై పొంగి ప్రవహిస్తున్న వరద నీటిదృశ్యం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 13 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో నిర్వహించబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ ఆమె వెంట ఉన్నారు. 78వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి ఉట్టి పడేలా నిర్వమించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఉట్టిపడేలా స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలని, సీటింగ్ ఏర్పాట్లు తదితర వాటిపై ఆదేశాలిచ్చారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం నిరంతరం కొనసాగించాలి



వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 13 : స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిరంతరం కొనసాగించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి సీతక్క హైదరాబాద్ నుండి అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చేసిన సూచనల అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మహిళాశక్తి, పలు అభివృద్ధి సంక్షేమ పథకాలపై చర్చించారు. ఈ నెల 5 నుండి 9 వరకు స్వచ్ఛదనం - పచ్చదనం విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. మొక్కలు నాటడం, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క ఆదేశించారని తెలిపారు. అభివృద్ధి పథకాల అమలుకు ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలందరినీ స్వయం సహాయక బృందాల్లో చేరేలా చూడాలన్నారు. వారికి లభించే ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతినెలా మొదటి మూడో శనివారం శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులను భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ఇప్పటికే 89 స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులు మంజూరు చేయాలని వినతి

ముధోల్, ఆగస్టు 13 : ముధోల్‌లో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని ముధోల్ మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ మంగళవారం హైదరాబాద్‌లోని విద్యాభవన్ ఉన్నత విద్యామండలి కమిషనర్ దేవసేనకు వినతి పత్రం అందజేశారు. ముధోల్‌లో గత 15 రోజుల నుండి గ్రామాభివృద్ధి సంఘ సభ్యులు, యువకులు, ఇతరుల ప్రోత్సాహంతో అడ్మిషన్లు పెరిగాయని తెలియజేశారు.

జిల్లా కేంద్రంలో బంద్ సక్సెస్



నిర్మల్‌లో మూసి ఉంచిన షాపింగ్ కాంప్లెక్స్

నిర్మల్ రూరల్, ఆగస్టు 13 : బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులకు మద్దతుగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ నిర్మల్‌లో సక్సెస్ అయ్యింది. మంగళవారం నిర్వహించిన ఈ బంద్‌లో ఆసుపత్రులు, మెడికల్ షాపులతో పాటు ఇతర అత్యవసర సేవలు మాత్రమే తెరిచి ఉంచగా, మిగతా వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని సహకరించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 13 : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిస్తూ మంగళవారం సాయంత్రం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి వివేకానంద చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు శివ కుమార్ మాట్లాడుతూ... బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్జీ సంఘ కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 13 : నిర్మల్ దర్జీ సంఘ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సామల శ్రీనివాస్, అధ్యక్షుడిగా శ్రీరాం ముత్యం, కార్యదర్శిగా ఎస్. సురేందర్, కోశాధికారిగా పోల్కం రాజేందర్ ఎన్నికయ్యారు.

సోయాలో ఎల్లో మొజాయిక్ వైరస్

ముధోల్, ఆగస్టు 13 : మండలంలోని ఆయా గ్రామ శివారులో గల సోయా పంటను మంగళ వారం మండల వ్యవసాయ అధికారి అజ్మీరా భాస్కర్ పరిశీలించారు. అయితే పలు గ్రామాల్లో సోయా పంటకు ఎల్లో మొజాయిక్ వైరస్ వచ్చినట్లు తెలిపారు. ఈ వైరస్ తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. నివారణకు ఈ పంట నుండి నివారించేందుకు ఎడిటోరినిప్రైడ్ 120 గ్రాములు ఎకరానికి లేదా ఇమిడ్రక్లోయిడ్రైడ్ 80 మిల్లీలీటర్లు ఎకరానికి కలిపి పిచికారి చేయాలన్నారు.



సోయా పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అజ్మీరాభాస్కర్

ఆసుపత్రి.. పాఠశాల భోజనాల్లో నాణ్యతపై ఎమ్మెల్యే అసంతృప్తి

- ప్రభుత్వ ఆసుపత్రి, మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఆకస్మిక తనిఖీ
- సదర్మాట్‌కు నీటి విడుదల
- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సదర్మాట్ ప్రారంభిస్తామని వెల్లడి



ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



మహాత్మజ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్, ఆగస్టు 13 : ఆసుపత్రి.. పాఠశాలల్లో అందించే భోజనాల్లో నాణ్యత కొరవడిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. తొలత సదర్మాట్ ఆయకట్టుకు నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సదర్మాట్ బ్యారేజీని ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రాంత రైతన్నను రాజు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సదర్మాట్ బ్యారేజీ ప్రారంభించడంతో పాటు కాలువలకు ఎటువంటి సమస్యలు లేకుండా మరమ్మతులు చేపడతామన్నారు. అనంతరం మస్కాపూర్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అక్కడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీ షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్- 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడారంగంలో సైతం రాణించాలని సూచించారు. మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించడం అభినందనీయమని ఉపాధ్యాయులను, విద్యార్థులను కొనియాడారు. విద్యార్థులు చేసిన యోగ సాంస్కృతిక నృత్యాల ప్రదర్శన అద్భుతంగా ఉందని ఎమ్మెల్యే ప్రశంసించారు.

ఆసుపత్రి.. పాఠశాలల్లో తనిఖీ..

ఇటీవల కాలం చెల్లిన మందులతో రోగికి చికిత్స నిర్వహించి రాష్ట్ర స్థాయిలో మీడియాలో వార్తల్లో పతాక శీర్షికల్లో నిలిచిన ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే బొజ్జు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఫార్మసీతో పాటు జనరల్ వార్డు, ఓపీ విభాగంలో మందులను పరిశీలించారు. ఇటీవల జరిగిన ఘటనపై స్పందించారు. కాలం చెల్లిన సెలైన్ బాటిల్ రోగికి ఎక్కించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అతనికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నామన్నారు. ఈ ఘటన మీడియాలో రావడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు జ్ఞానోదయం అయిందన్నారు. ఖానాపూర్ లాంటి ప్రాంతాలలో పని చేసి ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజనం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆసుపత్రిలో పర్యటిస్తున్న సమయంలోనే భోజనం కాంట్రాక్టర్ భోజనం తీసుకుని ఆసుపత్రికి రావడంతో ఆ భోజనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. నాసిరకమైన భోజనం రోగులకు అందిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో నీ దుకాణం సర్దేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన భోజనం అందించే క్రమంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్రే, సీబీపీ మిషన్ లాంటి ఆధునాతన పరికరాల కోసం తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం మహాత్మజ్యోతి బాపూలే బాలికల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు సైతం నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులలో ఫ్యాన్లు తిరగడం లేదని రాత్రివేళ విద్యార్థులకు దోమల బెడద ఉందని వెంటనే వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు తోట సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆకుల వెంకా గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమానుల్లాఖాన్, జంగిలి శంకర్, మడిగెల గంగాధర్, గుగ్లావత్‌రాజు, పోలంపల్లి సచిన్, గుడాల రాజన్న, మ్యాదరి రాజేశ్వర్, జహీర్, తదితరులున్నారు.

ఇథనాల్ పరిశ్రమ వద్దే వద్దు

- దిలావర్‌పూర్ బంద్ విజయవంతం
- జాతీయ రహదారిపై వంటావార్పు



దిలావర్‌పూర్ బంద్‌లో భాగంగా మూతపడ్డ దుకాణాలు

దిలావర్‌పూర్, ఆగస్టు 13 : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ గ్రామస్థులు చేస్తున్న నిరసన మంగళవారం నాటికి 21 రోజుకు చేరింది. గ్రామస్థులు రోజురోజుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ బంద్ విజయవంతమైంది. గ్రామంలోని షాపులు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు బంద్ పాటించారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఇథనాల్ పరిశ్రమ నిర్మిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని దిలావర్‌పూర్ గ్రామస్థులు హెచ్చరించారు. ఈ సందర్భంగా 61వ జాతీయ రహదారిపై వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుపైనే భోజనం చేశారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మానంతో గోదావరి జలాలు, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, భవిష్యత్ తరాలు ఇబ్బంది పడాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్య పోరాటంతో పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుందామని ప్రమాణం చేశారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో మనతో కలిసి వచ్చే నాయకులను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని, కలిసిరాని నాయకులను ఊరి పొలిమేర వరకు తరిమి కొడతామని హెచ్చరించారు. మాకు రాజకీయాలు అనవసరమని, పార్టీలు అక్కరలేదని, ప్రస్తుతం మా పార్టీ కేవలం ఇథనాల్ వ్యతిరేక పార్టీ మాత్రమేనన్నారు. మాకు ఉద్యమంలో మద్దతు పలికి కలిసి వచ్చే రాజకీయ పార్టీని ఆదరిస్తామన్నారు. ఉద్యమాన్ని ఉధృతం పరిశ్రమను అడ్డుకుంటామన్నారు.

సంక్షిప్త సమాచారం

హిందూ ఉత్సవ సమితి ఏకగ్రీవం

భైంసా, ఆగస్టు 13 : పట్టణ పరిధిలో హిందూ ఉత్సవ సమితి మహిషా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా పెండెపు కాశీనాథ్, ప్రధాన కార్యదర్శిగా సిందే కపిల్, కోశాధికారిగా తూమెల్ల దత్తాత్రి, సహ కోశాధికారిగా సక్కెర శ్రీనివాస్, ఉపాధ్యాక్షులుగా కుంట రాజలింగు, తోట విజయ్, చందులాల్, తోట రాము, లంక గంగాధర్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

15న కోరుట్లలో ధర్మ యుద్ధం సభ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 13 : ఈ నెల 15న జగిత్యాల జిల్లా కోరుట్లలో ధర్మసమాజ్ పార్టీ ధర్మయుద్ధం సభ నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రామగిరి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంపద భూమిలో సమాన వాటా దక్కాలంటే డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలోని ధర్మసమాజ్ పార్టీతోనే సాధ్యమన్నారు.

23న బ్లాక్ డేగా పాటించండి

కుంటాల, ఆగస్టు, 13 :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ సంబంధించి సీపీఎస్ విధానంలోనే కొనసాగుతామని చెప్తూ 2014 ఆగస్టు 23 న 28 జీవో విడుదల చేయడం జరిగిందని అందుకు నిరసనగా ఆగస్టు 23 న బ్లాక్ డేగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొండన్నగారి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ రోజున అన్ని మండలాల్లో జీవో 28 ప్రతులను కాల్చివేయాలన్నారు. త్వరలోనే పాత పెన్షన్ విధానం అమల్లోకి వచ్చేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.